క్లుప్తంగా

పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు వీరే..

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మండల విద్యాధికారి చిన్నికృష్ణ వ్యవహరించారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం తూర్పు యూనిట్ అధ్యక్షుడిగా తాజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా రామానాయక్, ప్రధాన కార్యదర్శిగా మహబూబ్‌బాషా, జాయింట్ సెక్రటరీగా గంగాధరం, ట్రెజరర్‌గా మల్లికార్జున, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా అశోక్‌కుమార్, అబూబకర్ సిద్దిఖీని ఎన్నుకున్నారు. పడమర యూనిట్ అధ్యక్షుడిగా వెంకటేషు, ఉపాధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరినాథ్, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాసాచారి, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా శ్రీనివాసరెడ్డి, అబ్దుల్‌రహీమ్ ఎన్నికయ్యారు. పంచాయితీరాజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన


శిల్పారామంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని శిల్పారామంలో చిన్నారులు తమ ఆటపాటలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆదివారం ఆహ్లాదం కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నైకు చెందిన హేమాళిని బృందం అన్నమయ్య కీర్తనలకు నృత్యం చేశారు. కార్యక్రమంలో ఏఓ ఖాదర్‌వలితో పాటు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ


టోర్నీలో విజేతలకు కప్‌ను అందిస్తున్న నిర్వాహకులు

ధర్మవరం: పట్టణంలోని మహాత్మాగాంధీ ఇండోర్ స్టేడియంలో మూడురోజులపాటు జరిగిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఇందులో 20 జట్లు పాల్గొన్నాయని టోర్నమెంట్ నిర్వాహకుడు ఎర్రజోడు చంద్ర తెలిపారు. టోర్నీలో పూజారి జగదీష్, ఐడీఎఫ్‌సీ బ్యాంకు ప్రవీణ్ విన్నర్స్‌గా మంత దామోదర్, నిఖిల్ జట్లు రన్నర్స్‌గా నిలిచారన్నారు. అనంతరం వారికి బహుమతులు అందజేశారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన వారికి సీనియర్స్ టోర్నీ నిర్వహించారు. ఇందులో విన్నర్స్‌గా ఆనంద్, రామాంజనేయులు, రన్నర్స్‌గా రాము, జోసెఫ్ నిలవడంతో వారికి బహుమతులను అందజేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


కొత్తచెరువులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోలీసులు వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చట్టవ్యతిరేఖ కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. వాహనదారులు వాహనాల రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, చలానాలు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు, నడపరాదని సూచిస్తూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే పాతనేరస్తులను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

సాలు పంట చాలిస్తున్నారు!

- ఏటేటా తగ్గిపోతున్న తృణధాన్యాల సాగు
- సాగుపై అవగాహన కల్పించని అధికారులు
- భవిష్యత్తులో గింజలకు తప్పని ఇబ్బందులు

తనకల్లు: అసలు పంట ఆదుకోకపోయినా కొసరు పంట ఆదుకుంటుందని పెద్దల సామెత. మండలంలో ఏటా ఖరీఫ్‌లో వేరుశనగతో పాటు సాలు పంటలను వేయడం ఆనవాయితీగా వచ్చేది. అయితే ఈ ఏడాది అదునులో వర్షాలు పడక జూన్, జూలై నెలల్లో వేరుశనగ పంటను అరకొరగా విత్తారు. తద్వారా సాలు (అంతర) పంటలైన కందులు, జొన్నలు, అలసంద, పెసలు, అనప తదితర పంటల జాడ లేకుండా పోయింది. దీంతో పాటు తృణధాన్యాలైన జొన్న, రాగులు, సజ్జ, కొర్ర లాంటి పంటలు సైతం సాగుకు నోచుకోవడంలేదు. గతంలో రైతులు చిరుధాన్యాలను బాగా పండించేవారు. ఒకప్పుడు ప్రతి ఇంట్లోను చిరుధాన్యాలు ఏడాదంతా ఉండేవి. వాటిలో పోషకాలు కూడా అధికంగా ఉండేవి. ప్రజలు ఆరోగ్యంగా ఉండి ఎంత కష్టమైన చేసేవారు.

పట్టించుకోని అధికారులు

మండలంలో పదేళ్లుగా చిరుధాన్యాల సాగు క్రమంగా తగ్గిపోయింది. నాడు వందలాది ఎకరాల్లో చిరుధాన్యాల సాగు ఉండగా నేడు బాగా సాగు బాగా తగ్గిపోయింది. వీటిపై సాగుపై రైతులకు ఎప్పుడుకప్పుడు అవగాహన కల్పించాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం కూడా ప్రోత్సహించడం లేదని పలువురు రైతులంటున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగితే చిరుధాన్యాల గింజలు కూడా లభించే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.


సజ్జ పంట


రాగి పంట

చిక్కిపోతున్న సాగు..

ఒకప్పుడు ఖరీఫ్‌లో విరివిగా చిరుధాన్యాలను రైతులు సాగు చేసేవారు. అంతర పంటలు, సాధారణ పంటలుగా కూడా వీటిని సాగు చేసేవారు. అయితే చిరుధాన్యాల సాగు క్రమంగా తగ్గిపోతోంది. తృణధాన్యాల్లో ముఖ్యమైన రాగి, సజ్జ, జొన్న, కొర్ర, సామ తదితర పంటల సాగు లేకుండా పోతోంది. అత్యధిక పోషకాలు కలిగిన ఈ ధాన్యాలు సాగు కనిపించకుండా పోయింది. చిరుధాన్యాల సాగు పెంచేందుకు వ్యవసాయశాఖాధికారులు చొరవ తీసుకోవాలి. చిరుధాన్యాల విత్తనాలను సబ్సిడీ ద్వారా రైతులకు అందించి మండలంలో చిరుధాన్యాల సాగును చేపట్టడానికి అధికారులు కృషి చేయాల్సి ఏంతైనా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

సాగు తగ్గించేశాం..

గతంలో పొలాల్లో వేరుశనగతో పాటు ఖచ్చితంగా సాలు పంటలైన కంది, అనప, పెసర, అలసంద తదితర వాటిని వేసేవారం. అయితే గత కొన్నేళ్లుగా వేరుశనగ పంటనే వేయడం లేదు. దీంతో గింజల పంటలు ఎలా సాగు చేసేది. మేము చిరుధాన్యాల సాగును పూర్తిగా తగ్గించేశాం. ప్రభుత్వం తృణధాన్యాల సాగుపై దృష్టి సారించాలి.


– నరసింహారెడ్డి, రైతు, ఎగువ బత్తినవారిపల్లి, తనకల్లు

మండలంలో తృణధాన్యాల సాగు వివరాలు

పంట	సాధారణ సాగు (ఎకరాల్లో)	ప్రస్తుత సాగు
జొన్న	23	11
కందులు	568	172
అలసంద	14	0
సజ్జ	240	80
రాగి	23	46
కొర్ర	10	0
సామ	12	0
ఉలవ	38	0
నువ్వులు	04	0
ప్రొద్దుతిరుగుడు	58	14
ఆముదం	07	0

తృణధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం

తృణధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. తృణధాన్యాల్లో ఉండే పోషకాలు ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయి. మార్కెట్లో కూడా మంచి డిమాండ్ ఉంది. రైతులు కూడా తృణధాన్యాలను సాగు చేస్తే అన్ని విధాలా లాభం ఉంటుంది. మండలంలో తృణధాన్యాల సాగు పెంపునకు కృషి చేస్తాం.
– భారతి, ఏఓ, తనకల్లు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


తుమ్మలబైలులో చిన్నారి సింధూతో మాట్లాడుతున్న సమన్వయకర్త మక్బూల్‌అహ్మద్

గాండ్లపెంట: వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధైర్య పడొద్దని, వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామని పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్‌అహ్మద్ భరోసా ఇచ్చారు. పల్లివాండ్లపలికి చెందిన దివ్యాంగుడు నాగార్జున పింఛన్ తొలగించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఆదివారం మక్బూల్ గ్రామానికి చేరుకుని నాగారజ్జునను పరామర్శించారు. పోతినేపల్లిలో పార్టీ కార్యకర్త నారాయణప్ప మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.తుమ్మలబైలు తండాలో కిడ్నీవ్యాధితో బాధపడుతున్న బాలాజీనాయక్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. తుమ్మలబైలులో చిన్నారి సింధూ పుట్టుకతో దివ్యాంగురాలైనా పింఛన్ను తొలగించడంతో చిన్నారి తండ్రి కళ్యాణ్‌తో మాట్లాడి పింఛన్ అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ మహమ్మద్ ఫరూక్ స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గజ్జలరవీందారరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ తాతం జగన్మోహన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, శంకర్‌నాయుడు, నాయకులు పామిడి ఇక్బాల్, అత్తార్ ఆసిఫ్, సూర్యనారాయణరెడ్డి, మేకల నరసింహులు, రవిచంద్రారెడ్డి, వద్దిరెడ్డి కృష్ణారెడ్డి, వేమనారాయణ, రాజన్న, దామోదర్, రాఘవరెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఇంతియాజ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం


పల్లెవాండ్లపల్లిలో క్యూర్ కోడ్ ఆవిష్కరిస్తున్న కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, నాయకులు

నల్లచెరువు: కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లు తొలగించడం తీవ్ర అన్యాయం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం పల్లె వాండ్లపల్లిలో ×బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ ద్వా చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 138 మంది దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం అక్రమంగా తొలగించిందన్నారు. తొలగించిన దివ్యాంగుల పింఛన్లను ప్రభుత్వం పునరుద్ధరించాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. టెంపుల్ మాజీ ఛైర్మన్ ఆనంద్‌రెడ్డి, సీనియర్ నేత బంద్రేవు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, రమణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ, మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి, పల్లె వెంకటరెడ్డి, మండల యూత్ కన్వీనర్ మన్సూర్ బాషా, కార్యదర్శి లక్ష్మీపతి, ట్రేడ్ యూనియన్ కన్వీనర్ ఖాదర్‌బాషా, బీసీ కన్వినర్ చిన్నపల్లి హరి, నరసింహారెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఆదినారాయణ, ఆనంద్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రామాంజనేయులు,యల్లప్ప, వెంకటరమణ (బాబు) గోవిందురెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వెంకటేష్‌నాయుడు, భాస్కర్ నాయుడు, నల్లచెరువు గ్రామ కన్వీనర్ సూర్యశేఖర్‌రెడ్డి, గుత్తా వెంకటేష్ నాయుడు, షేక్ మౌలాలి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగింపు దుర్మార్గం

బత్తలపల్లి: పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న దివ్యాంగుల పింఛన్లను ఆంక్షల పేరుతో తొలగించడం దుర్మార్గమని ఎంపీపీ బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. ఆదివారం ఆమె గుమ్మల్లకుంటలోని స్వగృహంలో విలేకర్లతో మాట్లాడారు. సదరం సర్టిఫికెట్‌లో గతంలో 80 శాతం వరకు దివ్యాంగులుగా గుర్తించిన వైద్యులు నేడు అదే వ్యక్తులకు 30 నుంచి 40 శాతం మాత్రమే ఇవ్వడం కూటమి ప్రభుత్వ కుతంత్రాలకు నిదర్శనమన్నారు. అనారోగ్య సమస్యలతో కకావికలం అవుతున్న వారి పింఛన్లు తొలగించడం, వారి గోడు చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వెరిఫికేషన్ చేయకుండానే వికలత్వ పరీక్షలు పూర్తి చేసినట్లు తప్పుడు నివేదికలు అందజేశారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి నియోజకవర్గంలోనే ఇలా వైద్యులు తూతూ మంత్రంగా పరీక్షలు చేశారన్నారు. వారిపైన చర్యలు తీసుకోవాలన్నారు. మరోసారి ప్రభుత్వ వైద్యులచే పింఛన్ రద్దయిన దివ్యాంగుల దివ్యాంగత్వాన్ని పరిశీలించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అ'పూర్వ' కలయిక


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కదిరి అర్బన్: పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సమావేశం నిర్వహించారు. తమకు పాఠాలు నేర్పిన గురువులను దుశ్శాలువా,పూలమాలలతో సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం పాఠశాలకు రూ. 20 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రహంతుల్లా, సుదర్శన్, అబాకస్ మధు, చంద్రశేఖర్, అనురాధ, సులోచన, పార్వతి పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్రికెట్ టోర్నీలో ఫైనల్‌కు చేరిన ఎన్‌పీకుంట జట్టు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందుకుంటున్న చందు

ఎన్‌పీకుంట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఎన్‌పీకుంట జట్టు ఫైనల్‌కు చేరింది. పెనుకొండ జూనియర్ కళాశాల మైదానంలో హిందూపురం, ఎన్‌పీకుంట జట్లు తలపడ్డాయి. ఇందులో ఎన్‌పీకుంట జట్టు 11 పరుగుల తేడాతో గెలుపొంది ఫైనల్ చేరుకున్నట్లు మెంటార్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా జట్టు కెప్టెన్ చందు ఎంపికయ్యారన్నారు. వచ్చేనెల 5న ఫైనల్ మ్యాచ్‌లో ఎన్‌పీ కుంట, రొద్దం జట్లు తలపడతాయని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, నాగరాజునాయక్, ఆనందనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎం నిర్లక్ష్యం.. రైతులకు శాపం

ఎన్‌పీకుంట: మరికొమ్మదిన్నె పంచాయతీలో విద్యుత్ శాఖ జేఎల్‌ఎం నిర్లక్ష్యంతో తమ పంటలు ఎండిపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంచాయితీలో అధిక సంఖ్యలో రైతులు టమాటతో పాటు వివిధ పంటలు సాగు చేశారు. ఈ క్రమంలో లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో నీరు సరిగా పారక పంట దిగుబడిపై ప్రభావం చూపుతోందని రైతులు చెబుతున్నారు. పంట పొలాల్లో ఏవైనా విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు జేఎల్‌ఎంకు సమాచారం ఇస్తే స్పందించడం లేదని, ఫోన్‌ద్వారా సంప్రదిస్తే తమపై అజమాయిషీ చలాయిస్తున్నాడని, ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఏఈఈ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు.

ప్రారంభానికి నోచుకోని విద్యుత్ సబ్‌స్టేషన్..

పంచాయతీలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. సబ్‌స్టేషన్ ప్రారంభమైతే లోఓల్టేజీ సమస్య తీరుతుందని, అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ విషయంపై మండల విద్యుత్‌శాఖ ఏఈఈ సాలెహాబాషాను వివరణ కోరగా మరికొమ్మదిన్నె సచివాలయం పరిధిలో జేఎల్‌ఎం పోస్ట్ ఖాళీగా ఉందని, దీంతో డిప్యూటేషన్‌పై శ్రీకాంత్ అనే వ్యక్తిని నియమించామన్నారు. జేఎల్‌ఎంను రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పొకొచ్చారు. త్వరలోనే రెగ్యులర్ జేఎల్‌ఎంను నియమిస్తామని, సబ్‌స్టేషన్‌ను ఛార్జ్ చేసి త్వరలోనే విద్యుత్ సరఫరా ప్రారంభిస్తామని తెలిపారు.

సెప్టెంబర్ 7న కంటి వైద్యశిబిరం

ధర్మవరం అర్బన్: సెప్టెంబర్ 7వతేదిన పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులతో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు. పట్టణంలోని స్వాతిక్లినిక్‌లో ఆదివారం శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. యువర్స్ ఫౌండేషన్ పీఆర్‌ఓ రాధాకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

నవ వరుడు అదృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన నవ వరుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు..గోవిందు అంజి అనే యువకుడికి ఈనెల 15న వైఎస్సార్ జిల్లా కమలాపురానికి చెందిన యువతితో వివాహం జరిగింది. ఈ నెల 23న కొత్త దుస్తులు కుట్టించుకొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆదివారం యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు ప్రారంభించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కదిరి టౌన్: బందారు నగర్‌లో ఆదివారం పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.6250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

డీఎస్సీలో రెండు పోస్టులకు ఎంపిక

ముదిగుబ్బ: ముదిగుబ్బకు చెందిన రవీంద్రాచారి కుమారుడు బీమగుండం పవన్ కళ్యాణ్ డీఎస్సీలో రెండు ఉద్యోగాలు సాధించాడు. రాయలసీమ జోన్–4లో టీజీటీ సోషల్ స్టడీస్ విభాగంలో 9వ ర్యాంక్, ఎస్ఏ సోషల్ స్టడీస్ విభాగంలో జిల్లా స్థాయిలో 39వ ర్యాంక్ సాధించాడు. కుమారుడు ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మలకవేమల క్రాస్‌కు చెందిన శివకుమార్ డీఎస్సీ(ఎస్జీటీ విభాగం)లో 21వ ర్యాంకు సాధించాడు. రైతు సదాశివుడు, పుష్పవతి దంపతులకు నలుగురు సంతానం. వారిలో ముగ్గురు కుమార్తెలు కాగా శివకుమార్ ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

సత్యసాయి భక్తుల అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుబ్బదాసు భజన మందిరంలో ఆదివారం శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు నారాయణసేవ చేపట్టారు. సేవాసమితి సభ్యులు సాంబశివ, నాగిరెడ్డి, శేషాద్రి, జనార్ధన్, కాకుమాని సాగర్, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 600 మందికిపైగా అన్నదానం చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

చెన్నేకొత్తపల్లి: ఆటలతో చిన్నారులకు ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని టింబక్టు కలెక్టివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య అన్నారు. టింబక్టు కలెక్టివ్ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న చిగురు సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సీవైఆర్సీ ప్రాంగణంలో ఆదివారం ఆటల పండుగ నిర్వహించారు. సంచులాట, కప్పలాగ గెంతడం, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ లాంటి ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన బాలబాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చిగురు సిబ్బందితో పాటు బాలబాలికలు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో పోలీసులు ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, రామగిరి సీఐ శ్రీధర్‌తో పాటు చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యానారాయణ, కనగానపల్లి ఎస్ఐ రిజ్వాన్ పాల్గొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి 44వ నంబరు జాతీయ రహదారి వరకూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. సైకిల్ తొక్కడం ద్వారా కండరాలు చురుగ్గా పనిచేయడంతో పాటు ఫిట్‌గా మారుతాయన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించుకొని విధిగా సైక్లింగ్ చేయాలన్నారు.

నేడు బత్తలపల్లిలో 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ'

బత్తలపల్లి: మండల కేంద్రంలో సోమవారం 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి ఆదివారం తెలిపారు. బత్తలపల్లిలోని గుండా కళ్యాణమండపంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.